నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ఉత్తనూరులో పశుబల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జోరుగా.. హుషారుగా..

- ఉత్తనూరులో పశుబల ప్రదర్శన పోటీలు

అయిజ, ఫిబ్రవరి 17 : మండలంలోని ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర పశుబల ప్రదర్శన పోటీలు హుషారుగా కొనసాగుతున్నాయి. ఉత్తనూరులోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం అఖిల భారత ఒంగోలు గోజాతి పశుబల ప్రదర్శన పోటీల్లో భాగంగా న్యూ కేటగిరీ విభాగ పోటీలను పారిశ్రామికవేత్త జల్లాపురం కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీ.శే. పులకుర్తి తిరుమల్‌రెడ్డి ఆశయ ఆకాంక్షలతో పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 10 జతల వృషభరాజములు పాల్గొనగా పోటీలను తిలకించేందుకు రైతులు, యువకులు భారీగా తరలివచ్చారు.

నేడు సీనియర్ విభాగం పోటీలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సీనియర్ విభాగం పశుబల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వృషభరాజములు తరలివస్తున్నట్లు దేవస్థాన కమిటీసభ్యులు పేర్కొన్నారు.

క్వార్టర్ ఫైనల్ పోటీల్లో తలపడుతున్న బాలుర జట్లు

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ టోర్నీ

అయిజ, ఫిబ్రవరి 17 : ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బాస్కెట్‌బాల్ టోర్నీ కొనసాగింది. క్వార్టర్ ఫైనల్‌లో 6 మహిళా జట్లు, 12 పురుషుల జట్లు పాల్గొనగా ఆదివారంతో పోటీలు ముగుస్తాయని టోర్నీ కార్యదర్శి కొట్టం నీలిమ తెలిపారు. పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ నయూముద్దీన్, రెఫరీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కర్నిలో పాల ఉట్లు కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు

కనుల పండువగా పాల ఉట్లు

మక్తల్, ఫిబ్రవరి 17 : మండలంలోని కర్ని గ్రామంలో కొలువుదీరిన గుంటి రంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం పాల ఉట్లను కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి పాల ఉట్ల స్తంభానికి పూజలు చేశారు. అనంతరం ఉట్లు కొట్టడానికి యువకులు పోటీ పడ్డారు. మహాద్వార్‌లోనూ గట్టుతిమ్మప్పస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాల ఉట్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని కొండపై నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి పాల ఉట్లకు పూజలు చేశారు. యువకులు ఒకరిపై ఒకరు ఎక్కి ఉట్లను అందుకొని కొట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగప్ప, ఆలయకమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, మహాద్వార్ ఆలయ ధర్మకర్త సురేందర్, చైర్మన్ రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

అధినేతకు అభిమానంతో..

- పండుగలా గులాబీ బాస్ జన్మదిన వేడుకలు
- ఊరూవాడా అంబరాన్నంటిన సంబురాలు
- కేక్ కటింగ్‌ల జోరు.. పటాకుల మోతల హోరు
- కొల్లాపూర్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- దవాఖానల్లో రోగులకు, అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ

తెలంగాణ ఉద్యమ సూరీడు.. స్వరాష్ట్ర సాధకులు.. జననేత.. ప్రగతి ప్రదాత.. సంక్షేమ సారథి, గులాబీ బాస్ కేసీఆర్ జన్మదిన వేడుకలు పండుగను తలపించాయి. ఊరూవాడా సంబురాలు అంబరాన్నంటాయి. కేక్ కటింగ్‌ల జోరు.. పటాకుల మోతలు హోరెత్తాయి. అధినేతపై అభిమానంతో గులాబీ పార్టీ శ్రేణులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. దవాఖానల్లో రోగులకు, వృద్ధాప్య, ఆశ్రమాల్లో అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొల్లాపూర్‌లో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందించారు. కేసీఆర్ చల్లగా ఉండాలంటూ పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శతమానం భవతి అంటూ అర్చకులు ఆశీర్వదించారు. జై కేసీఆర్.. సాహో కేసీఆర్ అంటూ నినదించారు.

– నెట్‌వర్క్, మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 17

మక్తల్‌లో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కొల్లాపూర్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డాకుల బస్టాండ్ ఆవరణలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

శకటోత్సవానికి హాజరైన భక్తజనం

శోభాయమానం.. శకటోత్సవం

- చెన్నకేశవుడి దర్శనానికి బారులుదీరిన భక్తులు
- కిటకిటలాడిన జాతర ప్రాంగణం

జడ్చర్ల, ఫిబ్రవరి 17 : మండలంలోని గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం శకటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో వచ్చిన భక్తులు గుడి ప్రధాన ద్వారం వద్ద పూజలు చేశారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చి చెన్నకేశవస్వామిని దర్శించుకోగా.. పలువురు దా సంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శకటోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద స్వీట్లు, తినుబండారాలు, ఆటవస్తువులు, గాజులు, కుంకుమ తదితర వస్తువులను కొనుగోలు చేస్తూ భక్తులు సందడిగా గడిపారు. ఫ్లైవీల్, రంగులరాట్నంపై చిన్నారులు, పెద్దలు ఎక్కి సరదాగా గడిపారు. జాతర ప్రాంగణంలో సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

- అపాయింట్‌మెంట్ ఇచ్చే ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- లక్ష్యం దిశగా అడుగులేయాలి
- కేఎల్ యూనివర్సిటీలో ఒకేసారి రెండు కోర్సులు చదివే అవకాశం
- కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ గీత
- 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', 'కేఎల్ యూనివర్సిటీ' ఆధ్వర్యంలో 'లక్ష్యం-2024'
- ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై పాలమూరు వాగ్దేవి కళాశాల విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రశాంత్

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రొఫెసర్లు

అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 17 : ప్రతి ఒక్కరినీ లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్దు.. వారి కలలను నిజం చేసే బాధ్యతను కేఎల్ యూనివర్సిటీ తీసుకుంటుందని ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. శనివారం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'ఇంటర్ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలు' అనే అంశంపై 'లక్ష్యం-2024' పేరిట జిల్లా కేంద్రంలోని క్రాన్ గార్డెన్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు వాగ్దేవి కళాశాల విద్యార్థులు 400లకు పైగా హాజరవగా ప్రొఫెసర్ ప్రశాంత్ వారినుద్దేశించి మాట్లాడారు. ఎదగాలనే సంకల్పం బలంగా ఉన్నవారిని ఎవరూ ఆపలేరన్నారు. మీ లక్ష్యానికి కేఎల్ యూనివర్సిటీ గైడ్ తోడైతే గమ్యం మరింత సులువవుతుందని తెలిపారు. భూమిలో వేసిన విత్తనాన్ని నాశనం చేసేందుకు పురుగులు, కీటకాలు ప్రయత్నిస్తుంటాయని, వాటినన్నింటినీ అధిగమించి మొక్కగా ఎదుగుతుందన్నారు. దానికి కూడా మేకలు, గొర్రెలు తింటూ అడ్డుపడుతుంటాయని.. అయినప్పటికీ ఆటంకాలను తొలగించుకొని మహావృక్షంగా అవతరిస్తుందన్నారు. అలా మనం కూడా ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరికీ తెలివితేటలు ఉంటాయి.. వాటిని వినియోగించుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. మెరిట్ విద్యార్థులకు తమ యూనివర్సిటీ రూ. 100 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందిస్తూ తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. ఈ యూనివర్సిటీలో డిగ్రీ (బీ.టెక్) చదివే విద్యార్థులు ఒకేసారి రెండు కోర్సులు పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. బీటెక్ చదువుతున్నప్పుడే వారి స్కిల్స్‌ను పరిగణలోకి తీసుకొని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివి ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందని వివరించారు. రూ.60లక్షల వార్షిక ప్యాకేజీతో విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. దేశ విదేశాల్లోనూ కేఎల్ యూనివర్సిటీకి 70 నుంచి 80 విశ్వవిద్యాలయాలతో అనుబంధం ఉందని, వారితో సంప్రదింపులు జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. న్యాక్ గుర్తింపులో నాలుగు మార్కులకు గానూ కేఎల్ యూనివర్సిటీకి 3.86 మార్కులు వచ్చాయన్నారు. మైక్రోసాఫ్ట్, విప్రోతోపాటు పలు పెద్ద కంపెనీలతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక సిలబస్‌తో కూడిన పుస్తకాలను సంబంధిత అధికారుల సమక్షంలో తయారు చేస్తారని వివరించారు. 1983లో ఆరంభమైన కేఎల్ యూనివర్సిటీ 40 ఏండ్లుగా వేలాదిమంది విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించిందన్నారు. విద్యార్థులకు యూనివర్సిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి జీవితానికి భరోసానిస్తుందన్నారు. అనంతరం ఇంటర్ ఫస్టియర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇంటర్ తరువాత ఎటు వైపు? అనే అంశంతో అవగాహన సదస్సును ఏర్పాటు చేయడంతో వాగ్దేవి విద్యార్థులు నమస్తే తెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ విజయ్‌కుమార్‌రెడ్డి, యాంకర్ ఆదిత్య, కేఎల్ యూనివర్సిటీ మేనేజర్లు వెంకటేశ్, నరేశ్, దిలీప్, నమస్తే తెలంగాణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ తర్వాత ఏం చదవాలో తెలుసుకున్నా..

ఈ సదస్సులో ఇంటర్ తరువాత ఏం చదవాలో తెలుసుకున్నా. భవిష్యత్తులో ఏ విధంగా ముందుకెళ్తే బాగుంటుందనే అంశాన్ని ప్రొఫెసర్లు చాలా చక్కగా వివరించారు. ఏ కోర్సు చేస్తే మంచిగా ఉంటుంది.. అనే విషయాలపై స్పష్టత వచ్చింది. అత్యధిక ప్యాకేజీ ఇచ్చే కంపెనీల్లో స్థానాన్ని దక్కించుకునేందుకు విద్యార్థులకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయి.

- యు.ఉమేశ్, ఇంటర్ సెకండియర్

ఇదో చక్కటి అవకాశం..

కేఎల్ యూనివర్సిటీ, ప్రముఖ దినపత్రికలు నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ సదస్సు చాలా ఉపయోగకరమైనది. ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఇంటర్ తరువాత ఏం చదవాలో మాకు అవగాహన వచ్చింది. మాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు చదవాలి, చదివిన తర్వాత కలిగే ప్రయోజనాలు ఎలా ఉంటాయనే అంశాలను స్పష్టంగా గైడ్స్ తెలిపారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఇదో చక్కటి అవకాశం.

- ఇ.జగదీశ్, ఇంటర్ సెకండియర్

లక్ష్య సాధనకు మార్గం దొరికింది..

నేను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ అవగాహన సదస్సు ద్వారా చక్కటి మార్గం దొరికింది. ఇంటర్ తర్వాత ఎలాంటి కోర్సులు తీసుకోవాలనే అంశాన్ని చక్కగా వివరించారు. భవిష్యత్తులో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ విద్యపై ప్రశాంత్ సార్ చాలా గొప్పగా వివరించారు. ఇలాంటి యూనివర్సిటీలో చదివితే మా భవిష్యత్తు చాలా మంచిగా ఉంటుందనిపించింది. గీత మేడం కూడా బీ-ఫార్మసీ గురించి చాలా చక్కగా వివరించారు. చదివిన తరువాత ఎలాంటి ప్యాకేజీలు వస్తాయనే విషయాలు తెలుసుకున్నాం.

- లహరిక, ఇంటర్ సెకండియర్

భవిష్యత్తులో ఏ కోర్సు తీసుకోవాలో తెలిసింది..

కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ అవగాహన సదస్సు చాలా మంచిగా ఉంది. ఈ సదస్సులో గైడ్స్ ఇంటర్మీడియెట్ తర్వాత ఎలాంటి కోర్సులు తీసుకోవాలనే విషయంపై చక్కని అవగాహన కల్పించారు. నా లక్ష్యానికి ఈ అవగాహన సదస్సు చాలా ఉపయోగకరంగా ఉంది. కేఎల్ యూనివర్సిటీలో చోటు దక్కించుకొని చదవాలని ఉంది. చదివిన తరువాత భవిష్యత్తులో ఎలాంటి ప్యాకేజీలు వస్తాయనే వివరాలను చక్కగా వివరించారు. ఈ సదస్సు మాకు ఎంతో ఉపయోగకరమైనది.

- నిఖిత, ఇంటర్ సెకండియర్

లక్ష్యాన్ని ఇప్పుడే నిర్దేశించుకోవాలి : ప్రొఫెసర్ గీత

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గీత అన్నారు. ఏం కావాలో తెలుసుకున్నప్పుడే ఎటు వెళ్లాలో తెలుస్తుందన్నారు. విద్యార్థుల చదువుకు అవసరమైన వసతులు సమకూర్చి రెండు, మూడు ప్లేస్‌మెంట్స్ వచ్చేలా కేఎల్ యూనివర్సిటీ కృషి చేస్తుందన్నారు. నాలుగేండ్లు కష్టపడి చదివితే జీవితాంతం సుఖవంతమైన జీవితాన్ని కొనసాగించొచ్చని సూచించారు. నిర్లక్ష్యం జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు.

మీ కోసం వచ్చేలా ఎదగాలి

నీకు అపాయింట్‌మెంట్ ఇవ్వని వారు.. మిమ్మల్ని కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకునే స్థాయికి ఎదగాలని వాగ్దేవి కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. సృష్టిలో మనిషికి తప్పా మరే ఇతర జీవులకు ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకునే అవకాశం ఉండదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కేఎల్ యూనివర్సిటీ, నమస్తే తెలంగాణ సంయుక్తంగా ఏటా ఇంటర్ విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. కే ఎల్ యూనివర్సిటీ కెరీర్ గైడెన్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు.